ట్రాన్స్ లొకేట్ పేరుతో ఇష్టారాజ్యంగా

చెట్ల నరికివేత..!

ఆ తర్వాత చెట్టును పూర్తిగా కనిపించకుండా చేస్తున్న వైనం

- లొసుగులు అడ్డం పెట్టుకొని అనుమతులు
- ఇంత జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- చెట్లను తొలగించే క్రమంలో సిబ్బంది చేతివాటం
- తూ తూ మంత్రంగా అటవీ శాఖ విచారణ



నరికిన చెట్లను ఆటోలో తరలిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఒకవైపు పచ్చదనాన్ని పెంచేందుకు ఎక్కడికక్కడ వివిధ సందర్భాల్లో మొక్కలు నాటుతూ వాటిని సంరక్షించే బాధ్యతలు చేపడు తోంది. కానీ, కొంతమంది మాత్రం ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ భారీ చెట్లను రాత్రికి రాత్రే నేలమట్టం చేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగంలోని లొసుగులను ఆసరాగా తీసుకొని కొందరు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ 20-30 సంవత్సరాల వయసున్న చెట్లను అవలీలగా కొట్టేస్తున్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో గడిచిన మూడు నెలల్లో పదుల సంఖ్యలో ప్రధాన రోడ్లు, కాలనీల్లో ఉన్న చెట్లను కొంతమంది ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకొని కొట్టేస్తున్నారు. కొన్నిరోజుల క్రితం బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు ఎదురుగా ఉన్న 30 ఏళ్ల నాటి భారీ చెట్టును ట్రాన్స్ లొకేట్ పేరుతో కొట్టేయడంతోపాటు పక్కనే ఉన్న మరో రెండు చెట్లను చాలా వరకు కొట్టివేశారు. ఈ భవనంలో ఏర్పాటు చేసిన కమర్షియల్ సంస్థ కనిపించడం లేదనే సాకుతో జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకొని చెట్టును కొట్టేశారు. కానీ, ఈ చెట్టు వల్ల ఆ ఇంటికిగానీ, ఆ భవనానికి గానీ ఎటువంటి ప్రమాదం లేదు. కేవలం తమ భవనం కనిపించడం లేదనే సాకుతో మాత్రమే మూడు చెట్లకు ట్రిమ్మింగ్ అనుమతులు తీసుకొని రెండు చెట్లను నరికేసి మొండెం వరకు మిగిల్చారు. మరోవైపు ఇదే భవనం పక్కన ఉన్న మరో భవనం ముందు ఓ చెట్టును పూర్తిగా తొలగించి ఎవరికి అనుమానం రాకుండా ఓ కుండీని దానిపై పెట్టారు.

అధికారుల అలసత్వం

కేబీఆర్ పార్కు ఎదురుగా ఉన్న భారీ చెట్టును సరైన అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా కొట్టివేసిన తీరుపై పత్రికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో అక్కడికి విచారణకు వెళ్లిన కేబీఆర్ పార్కు అధికారి మహ్మద్ యూసుఫ్‌కు చేదు అనుభవం ఎదురైంది. అక్కడికి వెళ్లి చెట్టు గురించి సంబంధిత దుకాణం యజమానితో మాట్లాడుతున్న సమయంలోనే అక్కడికి మద్యం తాగి వచ్చిన యూబీడీ సిబ్బంది సదరు అధికారిని దుర్భాషలాడడంతో పాటు దాడి చేసేందుకు యత్నించినట్లు సమాచారం. అన్ని అనుమతులు తీసుకొని చెట్టు కొట్టేశారని మీరెందుకు ఫైన్ వేసేందుకు వచ్చారంటూ సదరు సిబ్బంది దబాయించి ఫారెస్ట్ అధికారిని అక్కడి నుంచి పంపించడం గమనార్హం.

సెలవు దినాల్లోనే అధికం

వరుస సెలవులు వచ్చినప్పుడే ఈ చెట్ల నరికివేతను నిర్వహిస్తున్నారు. యూసుఫ్‌గూడ స్టేట్ హోం ఎదురుగా పార్కింగ్ కోసం మూడు చెట్లను ఓ ఇంటి యజమాని నరికివేశాడు. ఆర్‌బీఐ క్వార్టర్స్ వద్ద ఓ నిర్మాణ దారుడు తన అపార్ట్‌మెంట్‌కు చెట్టు అడ్డుగా ఉందని దాన్ని కొట్టేసి ఆధారాలు లేకుండా నరికిన కొమ్మలను ఆటోలో తరలించేశాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ అధికారులు నిర్మాణ దారుడిని ప్రశ్నించగా అసలు చెట్టే లేదని వాదించడం ఆశ్చర్యపరిచింది. పరిస్థితి ఇలాగే ఉంటే నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతుందనడంలో అతిశయోక్తి లేదు.

అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి

సాధారణంగా ఓ చెట్టు కొట్టేయాలంటూ ఎన్నో అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇంటి ఆవరణలో ఉన్న చెట్టు వల్ల గానీ, ఇంటి ముందున్న చెట్టు వల్ల గానీ, ఇంటికి గానీ, ఇంటి ప్రహరీకి గానీ ప్రమాదకరంగా ఉన్నట్లయితే, లేదంటే చెట్టు ఒంగిపోయి కూలిపోయే విధంగా ఉన్నట్లయితే మాత్రమే చెట్టు కొట్టేందుకు అనుమతి ఉంటుంది. ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లు కొట్టేసేవారికి అటవీ శాఖాధికారులు లక్షలాది రూపాయల జరిమానాలు విధిస్తారు. కొన్ని రోజుల క్రితం వినాయక చవితి ఉందని కేబీఆర్ పార్కు వాకర్ పార్కు నుంచి కొన్ని ఉత్తరేణి కొమ్మలను అనుమతి లేకుండా కోశాడని రూ.10 వేల జరిమానా విధించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.2 లుంబిని మాల్ ఎదురుగా అనుమతి లేకుండా చెట్టు కొట్టేసిన వ్యక్తికి రూ.3 లక్షల 60 వేలు జరిమానా విధించారు. ఇవన్నీ చూస్తున్న సదరు ఇంటి యజమానులు యూబీడీలో ఉన్న కొంతమంది సిబ్బందితో కుమ్మక్కై కేవలం చలానా మాత్రమే చెల్లించి అడ్డదారుల్లో అనుమతులు ట్రాన్స్ లొకేట్ పేరుతో అనుమతులు పొందుతూ భారీ చెట్లను కొట్టివేస్తున్నారు. ఈ వ్యవహారంలో కొంతమంది రాజకీయ నేతల వద్ద పనిచేస్తున్న కార్యాలయ సిబ్బందితో పాటు వ్యక్తిగత సిబ్బంది ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. సదరు యజమానులు చెట్టు కొట్టేసేందుకు దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆ ఫైల్ అటవీ శాఖకు వెళ్తుంది. వారు ఈ చెట్టు కొట్టేయాలంటే జీహెచ్ఎంసీ నుంచి ఎన్‌వోసీ రావాలని చెప్తారు. దీంతో వెంటనే సదరు యూబీడీ సిబ్బంది మేయర్, ఎమ్మెల్యే కార్యాలయాల్లో తమకు అనువుగా ఉన్న నేతలు, కార్యాలయ సిబ్బందితో కలిసి వారి కార్యాలయాల నుంచి యూబీడీ అధికారులు, అటవీ శాఖ అధికారులపై ఒత్తిడి పెంచి చెట్టు కొట్టేసేందుకు కావాల్సిన అనుమతులను పొందుతున్నారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఈ తతంగం వల్ల ఎన్నో ఏళ్లు ఉన్న భారీ వృక్షాలు కనుమరుగైపోతున్నాయి. ట్రాన్స్‌లొకేట్ పేరుతో అనుమతులు పొందుతున్న వారు మళ్లీ ఆ చెట్లను మరోచోట పెట్టి చూపించిన దాఖలాలు కూడా లేకపోవడం గమనార్హం.



రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ మోసిన్ ఖురేషి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణకుమార్, నాయకులు మహ్మద్ ఖాజాపాషా, పి.ఆకాష్, మహిపాల్, భిక్షపతి

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

హడ్కో ద్వారా ఐదు సంవత్సరాల పన్ను రహిత బాండ్‌లు

బంజారాహిల్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హడ్కో) ద్వారా పన్ను రహిత బాండ్‌లు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ దల్జీత్‌సింగ్ ఖత్రి తెలిపారు. బంజారాహిల్స్‌లో సోమవారం క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ మినహాయింపు బాండ్‌లపై చర్చించేందుకు అసోసియేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దల్జీత్ మాట్లాడుతూ ఏప్రిల్ 7న హడ్కో ద్వారా బాండ్‌ను ప్రకటించినట్టు చెప్పారు. ఐదు సంవత్సరాల కాల పరిమితి ఉండే ఇందులో ఆరునెలల్లో రూ.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చని వివరించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధాకర్‌బాబు, రీజనల్ చీఫ్ అకౌంటెంట్ సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

బోరబండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరం వంటిదని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి అన్నారు. రహ్మత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరామ్‌నగర్‌కు చెందిన సయ్యద్ సిరాజ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.1.5 లక్షల ఎల్‌వోసీ, రహ్మత్‌నగర్‌కు చెందిన శశిరంజన్‌శర్మకు రూ.3 లక్షల ఎల్‌వోసీని వారి కుటుంబసభ్యులకు కార్పొరేటర్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భవనం పై నుంచి పడి వ్యక్తి మృతి

అమీర్‌పేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భవనం పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్‌లోని ధనలక్ష్మి బ్యాంక్ ఎదురుగా ఉన్న 51/3 ఆర్టీ భవనం మూడో అంతస్థు నుంచి ఓ వ్యక్తి కిందపడి మృతిచెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సుమారు 50-55 సంవత్సరాల వయసున్న వ్యక్తి భవనాన్ని ఆనుకుని ఉన్న మామిడి చెట్టు కాయలను తెంచే క్రమంలో భవనం పై నుంచి జారిపడి మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతిచెందిన వ్యక్తికి సంబంధించిన వివరాలు ఏమి తెలియరాలేదని, పోస్టుమార్టం నిమిత్తం మృదేహన్ని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరావు



మాగంటి కుటుంబసభ్యులను పరామర్శించిన తలసాని, మహమూద్ అలీ

మాగంటి లేని లోటు బీఆర్ఎస్‌కు తీర్చలేనిది

బంజారాహిల్స్/హైటెక్‌సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మాగంటి లేని లోటు బీఆర్ఎస్‌కు తీర్చలేనిదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరావు అన్నారు. మాదాపూర్‌లోని దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నివాసానికి సోమవారం ఆయన వెళ్లారు. మాగంటి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాగంటికి పార్టీ ఎటువంటి పని అప్పగించినా తనదైన శైలితో నిర్వహించే వారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. మాగంటి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులుఉన్నారు.

అలాగే మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ మాగంటి భార్య సునీత, కుమారుడు వాత్సల్యనాథ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మలక్‌పేట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆజాం, అమీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు హనుమంతరావు, నాయకులు నామన సంతోష్ కుమార్, అశోక్ యాదవ్, శ్రీహరి, ఆరీఫ్, హరిసింగ్, నారాయణరాజు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో వరద ముంపు ప్రాంతాల పరిశీలన



దుర్గంచెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైటెక్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లో వరద ముంపునకు గురవుతున్న ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం పరిశీలించారు. నెక్టార్ గార్డెన్స్ పరిసరాల్లో వర్షంపడితే నీటమునుగుతున్నాయని స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయన ఆ ప్రాంతాన్ని సందర్శించారు. వర్షపునీరు నిలవకుండా తీసుకోవాల్సిన చర్యలపై జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖల అధికారులతో చర్చించారు. దుర్గంచెరువుకు ఎండాకాలంలో కూడా నీటి కొరత ఉండదని, వర్షాకాలంలో నీటి నిల్వ స్థాయిని తగ్గిస్తే వరద పోటెత్తదని సూచించారు.

త్వరలో సమీక్ష

దుర్గంచెరువులో నీటి మట్టం నిర్వహణపై ఇరిగేషన్, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్ అధికారులను ఆదేశించారు. వరద కాల్వలను విస్తరించాల్సి ఉన్నా, వర్షాకాలం అయినా కొంతమేర తగ్గిస్తే మాదాపూర్ ప్రాంతంలో వరద ముప్పును తగ్గించే వీలుపై చర్చించనున్నారు. దుర్గంచెరువు దిగువ భాగంలో ఆక్రమణలతోపాటు వరద కాల్వకు ఉన్న ఆటంకాలను పరిశీలించారు. దుర్గంచెరువులో ఇనార్బిట్ మాల్ వైపు మట్టి పోయడంపైన ఆరా తీశారు. దుర్గంచెరువుకు ఇన్ ఫ్లో.. అవుట్ ఫ్లోను పరిశీలించారు.

సెల్‌ఫోన్ లాక్కుని ఉడాయించేందుకు యత్నం

- ఒక దొంగకు దేహశుద్ధి.. మరో దొంగ పరార్

అమీర్‌పేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దగ్గరలో వైన్స్ షాపు ఎక్కడుందని అడిగినందుకు తమతో వస్తే చూపిస్తామని వెంట తీసుకెళ్లిన ఇద్దరు దొంగలు అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కున్నారు. పారిపోతున్న ఇద్దరిలో ఒకడిని గట్టిగా పట్టుకుని దొంగలు.. దొంగలు అంటూ కేకలు వేశాడు. ఇది గమనించిన జనం అప్రమత్తమై బాధితుడు పట్టుకుని ఉన్న దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన పారా ప్రవీణ్ కుమార్(39) మాదాపూర్ కాకతీయ హిల్స్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన సోదరుడి ఇంటికి వెళ్లేందుకు ఆదివారం రాత్రి గ్రీన్‌ల్యాండ్స్ వద్ద బస్సు దిగి అమీర్‌పేట మైత్రివనం వైపు నడుచుకుంటూ వస్తున్న సమయంలో తన ముందు నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను వైన్స్ షాపునకు దారెటు అని అడిగాడు. తమ వెంట వస్తే చూపిస్తామని చెప్పడంతో వారి వెంట వెళ్లాడు. కొద్దిదూరం వెళ్లాక ప్రవీణ్ జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నారు. దొంగలు.. దొంగలు అంటూ ప్రవీణ్ గట్టిగా కేకలు వేస్తూ ఒకడిని గట్టిగా పట్టుకున్నాడు. అప్రమత్తమైన జనం బాధితుడి వద్దకు చేరుకుని దొంగకు దేహశుద్ధి చేసి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మరో దొంగను కూడా పట్టుకున్నారు. పట్టుబడ్డ నిందితులను కిషన్ తగ్దే, రాహుల్ మస్కెగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చిడా దహి మహోత్సవం

బంజారాహిల్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి(స్వర్ణ) ఆలయంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గౌడియా వైష్ణవ చిడా దహి మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. బెంగాల్ సంప్రదాయంలో రఘునాథ స్వామికి అటుకులు, బెల్లం, పాలు, పెరుగు, పండ్లతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకుడు సత్యగౌర చంద్రదాస పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

యూసుఫ్‌గూడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ అమ్మ బాలుర హాస్టల్ సమీపంలోని ఇండోర్ స్టేడియం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు యువకుడు గోపాలపురం సురేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. దీంతో అతడి వద్ద ఉన్న నగదు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో యువకుడిపై ముగ్గురు దాడి

యూసుఫ్‌గూడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాలానగర్‌కు చెందిన శ్రీరంగం రఘు యూసుఫ్‌గూడ సవేరా ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. సమీపంలోని దుకాణం ముందు కూర్చొని సిగరెట్ తాగుతున్నాడు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు అతడి వద్దకు వచ్చి బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితుడు రఘు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలి

బోరబండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్ ప్రాంతంలో చాలాకాలంగా పేరుకుపోయిన చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని డివిజన్ కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానాకు వినతి పత్రం అందజేశారు. రహదారిపై చెత్త పేరుకుపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రాకపోకలకు అంతరాయాలు కలుగుతున్నాయని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఉప కమిషనర్ త్వరలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చెత్తను తొలగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రహ్మత్‌నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గ్యార నాగరాజు, బీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడు జి.అరుణ్‌గౌడ్, శ్రావణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బంజారాహిల్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి నిధులు కేటాయించకుండా, పాలకమండలి ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్‌లోని రిక్రియేషన్ క్లబ్‌లో సోమవారం రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి, ప్రతినిధులు కనిమేని చక్రధర్‌రెడ్డి, ఎలిమినేటి సుమన్‌రెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, స్వప్నారెడ్డి, బాపురెడ్డి, రామచంద్రరెడ్డి, వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల సర్టిఫికెట్లు ప్రదానం

ఖైరతాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. పూర్తి చేసిన వారికి ఖైరతాబాద్ గణపతి వేదిక వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ జోన్ అదనపు డీసీపీ ఆనంద్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ పేద పిల్లలకు విద్యాదానం చేస్తే వారు ఉపాధి పొంది మరికొంతమందికి ఉపాధినిచ్చేలా ఎదుగుతారని అన్నారు. ప్రతీ ఒక్కరు విద్యార్థులకు తోచిన సహాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్, బీజేపీ నాయకురాలు వీణా మాధురి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు బాల్‌కుమార్, రాచప్ప, సతీష్, వినోద్, ప్రవీణ్, రఘు, తోట సురేందర్, శ్రీశైలం యాదవ్, నడికుడి రాజ్‌కుమార్, అల్లం రాజు పాల్గొన్నారు.



పోచమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

పోచమ్మ ఆలయ అభివృద్ధికి సహకరిస్తా : శ్రీ గణేష్

బోయినపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి బాపూజీనగర్ పోచమ్మ ఆలయం అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ హామీ ఇచ్చారు. సోమవారం పోచమ్మ దేవాలయం 15వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కొరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకర్, బాలకృష్ణ, నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు తదితరులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

తార్నాక, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు సూచించారు. బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం లాలాపేట్‌లోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్.రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణి, కందాడి నాగేశ్వర్ రెడ్డి, రవిప్రసాద్ గౌడ్, ప్రభుగుప్తా, పోచయ్య యాదవ్, శ్రీనివాసాచారి, వెంకటేశ్‌గౌడ్, వేణుయాదవ్, కనకట్ల హరి, గణేష్ ముదిరాజ్, భిక్షపతియాదవ్, వీరన్న, రాముపర్మ తదితరులు పాల్గొన్నారు.



బైసన్ పోలో గ్రౌండ్‌లో నాటిన రావిచెట్టు వద్ద కంటోన్మెంట్ సూపరింటెండెంట్ దేవేందర్, ఉత్తర మండల ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తదితరులు

రెండు చెట్లకు పునరుజ్జీవం

● ప్యాట్నీ కంపౌండ్ నుంచి అల్లనేరేడు, రావి చెట్ల తరలింపు

సికింద్రాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ప్యాట్నీ కంపౌండ్ నాలా ఆక్రమణల తొలగించే సమయంలో అక్కడ ఓ అల్లనేరేడు చెట్టు, ఓ రావి చెట్టు ప్రమాదంలో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకున్న అనంతరం వేటా ఫౌండేషన్ సహకారంతో సోమవారం అల్లనేరేడు చెట్టును కంటోన్మెంట్ గ్రౌండ్‌లో, రావి చెట్టును బైసన్ పోలో గ్రౌండ్‌లో నాటారు. ఈ రెండు చెట్ల పున:స్థాపనలో కంటోన్మెంట్ సూపరింటెండెంట్ దేవేందర్, ఉత్తర మండల ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏ.రమేష్, ఆర్ఎస్ఐ ఏ.అశోక్‌రెడ్డి, మారేడుపల్లి ట్రాఫిక్ ఎఎస్ఐ పి.శ్రీధర్ పాల్గొన్నారు.

అధర్మంపై ధర్మం గెలిచింది

● కార్పొరేటర్ సుచిత్ర శ్రీకాంత్



కార్పొరేటర్ సుచిత్ర

రాంగోపాల్‌పేట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అధర్మంపై ధర్మం విజయం సాధించిందని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. 2020లో జీహెచ్ఎంసీ ఎన్నికలకు సంబంధించి అతెల్లి అరుణ శ్రీనివాస్‌గౌడ్ హైకోర్టుకు వెళ్లగా సోమవారం కోర్టు తీర్పు వెల్లడించిందని చీర సుచిత్ర శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. 2020లో జీహెచ్ఎంసీ ఎన్నికలలో బేగంపేట్ డివిజన్‌కు చెందిన 270 ఓట్లు రాంగోపాల్‌పేట్ డివిజన్‌కు మళ్లించి వాటిని బీజేపీ అభ్యర్థికే పడేలా చేశారని ఆరోపిస్తూ జీహెచ్ఎంసీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారితో పాటు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌పై మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణ శ్రీనివాస్‌గౌడ్ ఎలక్ట్రోల్ కోర్టుకు వెళ్లారని తెలిపారు. అప్పట్లోనే ఆ కోర్టు అతెల్లి అరుణ శ్రీనివాస్‌గౌడ్‌కు వ్యతిరేకంగా తీర్పు వెల్లడిస్తూ కేసును డిస్మిస్ చేస్తూ తీర్పునిచ్చిందని వివరించారు. ఇదే విషయమై వారు హైకోర్టుకు వెళ్లగా అక్కడ కూడా కేసును డిస్మిస్ చేసిందని, దానిపై కూడా వారు మళ్లీ అప్పీల్ చేయగా హైకోర్టు సోమవారం కొట్టివేసిందని చీర సుచిత్ర శ్రీకాంత్ తెలిపారు.



ఆలయంలో ఆభరణాలు లెక్కిస్తున్న అధికారులు

మహంకాళి ఆలయంలో ఆభరణాల లెక్కింపు

● లభించని కొన్ని ఆభరణాల ఆచూకీ.. పోలీసులకు ఫిర్యాదు

తిరుమలగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ తిరుమలగిరి లాల్‌బజార్‌లోని శ్రీ మహంకాళి దేవాలయంలోని అమ్మవారి ఆభరణాలను సోమవారం లెక్కించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన ఆభరణాలను లెక్కించాలని గతంలో స్థానిక భక్తులు, అమ్మవారి సేవకులు చేసిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా ఈఓలు సత్యచంద్రరెడ్డి, మహేందర్‌రెడ్డి, రవికాంత్, ఇన్‌స్పెక్టర్ ఆండాల్, స్థానిక భక్తులు, అమ్మవారి సేవకుల ఆధ్వర్యంలో ఆభరణాలను లెక్కించారు. కొన్ని ఆభరణాలు కలిపించకపోవడంతో తాత్కాలిక పూజారిని ప్రశ్నించగా ఆయన పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని ఆలయ ఈఓ సత్యచంద్ర రెడ్డి తెలిపారు. ఈ మేరకు తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ ఈఓ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోయినపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బోయినపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీకాంత్ తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు భూదేవినగర్, రామరాజునగర్, శంకర్ ఎన్‌క్లేవ్, సమతానగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. మధ్యాహ్నం 2:30 నిమిషాల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు హర్షవర్ధన్ కాలనీ, ప్రియదర్శిని సెంటర్, ఓల్డ్ బోయినపల్లి లాస్ట్ బస్టాప్, ఆలీ కాంపెక్స్, బడగూడ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ఈ నంబర్‌లకు 8712470559, 8712470348, 8712470346లను సంప్రదించ వచ్చని ఏడీఈ పేర్కొన్నారు.

రైల్వే ఆడిట్ పార్కుకు 163 ఏళ్లు

చిలకలగూడ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రణగొణ ధ్వనులకు దూరంగా.. చల్లటి నీడనిచ్చే భారీ వృక్షాలు.. ఎటు చూసినా పచ్చదనం.. పూల మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణన్ని అందిస్తోంది రైల్వే ఆడిట్ పార్కు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, లేఖాభవన్ పక్కన ప్రిన్సిపల్ డైరక్టర్ ఆఫ్ ఆడిట్ కార్యాలయంలో ఈ పార్కుని 1862వ సంవత్సరంలో నాలుగు ఎకరాల్లో ఏర్పాటు చేశారు. 2012వ సంవత్సరం మే 11తేదీ నాటికే 150 సంవత్సరాలు పూర్తి చేసుకుందని రైల్వే అధికారులు యానివర్సరీ పార్కుగా ప్రకటించి బోర్డు ఏర్పాటు చేశారు. 2025 మే 11వ తేదీ నాటికి 163 ఏళ్ల పూర్తి చేసుకుంది. ఈ పార్కుని సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9గంటల నుంచి 6గంటల వరకు తెరుస్తారు. రైల్వే సిబ్బందిని మాత్రమే లోనికి అనుమతిస్తారు. రోజూ దాదాపు 250 నుంచి 300 మంది రైల్వే సిబ్బంది టిఫిన్ బాక్స్‌ల్లో తెచ్చుకున్న భోజనాన్ని మధ్యాహ్న సమయంలో ఈ పార్కులో తింటారు. కొద్దిసేపు ఆహ్లాదకర వాతావరణంలో సేదదీరుతారు. రైల్వే అధికారులు దృష్టిసారించి ఈ పార్కును మరింత అభివృద్ధి చేయాలని రైల్వే సిబ్బంది కోరుతున్నారు.



అధికారులు 2012లో ఏర్పాటు చేసిన బోర్డు



పార్కులో పచ్చని చెట్లు

మధ్యాహ్నం లంచ్ చేసేవాళ్లం



దాదాపు 40 ఏళ్ల క్రితం కొద్ది రోజులు ఇక్కడ పనిచేశాను. మధ్యాహ్నం ఇళ్ల దగ్గర నుంచి తెచ్చుకున్న బాక్స్‌లను అందరం కలిసి పార్కులోకి తీసుకెళ్లి చల్లటి వాతావరణంలో భోజనాలు చేసేవాళ్లం. అప్పట్లో ఇంత ట్రాఫిక్ ఉండేది కాదు.

- ఎ. రామ్‌ప్రసాద్, రైల్వే మాజీ ఉద్యోగి

పార్కు అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలి



పురాతనమైన ఈ పార్కులో మరిన్ని రకాల మొక్కలను పెంచడంతో పాటు పచ్చదనం పెంపొందించాలి. నిధులు, సిబ్బంది కొరత లేనందున రైల్వే అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాలి.

- యూ. శ్రీనివాస్, రైల్వే మాజీ ఉద్యోగి



పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న జంపన ప్రతాప్

వైభవంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

బోయినపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు 1వ వార్డు పరిధిలోని బోయినపల్లి బాపూజీనగర్‌లో గల శ్రీ పోచమ్మ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, హారతి, కుంకుమ పూజ నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకర్, సంపత్ కుమార్, కనకరాజు, రాము, అజిత్, ప్రేమ్ ముదిరాజ్, శ్రీకాంత్, బాలకృష్ణ, నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద



గాత్ర కచేరీలో రాధా పద్మనాభన్ తదితరులు

అలరించిన కర్ణాటక గాత్ర కచేరి

చిలకలగూడ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీ చంద్రశేఖరేంద్ర ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి, కంచి పరమాచార్య జయంతి వేడుకలను వెస్ట్ మారేడుపల్లి, మీనాక్షి సుందరం హాల్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సంగీత సరస్వతి రాధా పద్మనాభన్ గాత్ర కచేరి నిర్వహించారు. ఆమె జనరంజకమైన త్యాగరాజ స్వామి కీర్తనలు శ్రావ్యంగా ఆలపించి ఆహుతుల కరతాళ ధ్వనులందుకున్నారు. వయోలిన్ కోలంక సాయికుమార్, మృదంగం డాక్టర్ శ్రీనివాస గోపాలన్, ఘటంపై టి.ఇ.బాలసుబ్రమణ్యం వాద్యసహకారం అందజేశారు. ముఖ్య అతిథిగా రెయిన్‌బో హస్పిటల్స్ డైరెక్టర్ రంగనాథ అయ్యర్ విచ్చేసి కళాకారులను సత్కరించారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేసిన విశ్వకర్మ సంఘం సభ్యులు

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

రాంగోపాల్‌పేట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్తుకై మా వంతు కృషి చేస్తున్నామని విశ్వకర్మ సంఘం అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘం భవనంలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కరాచారి మాట్లాడుతూ ఈ సంవత్సరం మొత్తం 2500 పుస్తకాలతో పాటు స్టేషనరీని కూడా 300 మందికి పైగా విద్యార్థులకు పంపిణీ చేశామని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీతో పాటు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కటకం చక్రపాణి, కోశాధికారి బోనాల శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతి



అడ్డగుట్ట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడ చౌరస్తాలో గుర్తుతెలియని యువకుడి(25) మృతదేహం ఉందనే సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెస్టారెంట్‌లో డిప్యూటీ మేయర్ ఆకస్మిక తనిఖీ

● కుళ్లిన ఆహార పదార్థాలు ల్యాబ్‌కు తరలింపు

● యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన శ్రీలతశోభన్‌రెడ్డి

తార్నాక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తార్నాకలోని డెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం డెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో కుళ్లిన స్థితిలో ఉన్న ఆహార పదార్థాలను గమనించిన డిప్యూటీ మేయర్ రెస్టారెంట్ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు, ఫుడ్ సేఫ్టీ అధికారులను పిలిపించి కుళ్లిన ఆహార పదార్థాలను ల్యాబ్‌కు తీసుకువెళ్లి పరీక్షించిన తరువాత రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు తప్పనిసరిగా ఆహారం నాణ్యత, శుభ్రత పాటించాలని, లేని పక్షంలో చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా నగరంలోని అన్ని రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్‌లలో ఫుడ్ సేఫ్టీని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



చికెన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి తదితరులు

మూడు నెలల రేషన్ తీసుకోవాలి: ఏఎస్ఓ



ఏఎస్ఓ క్రిష్ణవేణి

రాంగోపాల్ పేట్, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు గాను ఒకే సారి పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ అందిస్తుందని, రేషన్ కార్డుదారులు ఈ నెలలోనే మూడు సార్లు ఈ పాస్ ద్వారా బయోమెట్రిక్ వేసి రేషన్‌ను తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ సర్కిల్ నం 8 సహాయ పౌరసరఫరాల అధికారి(ఏఎస్ఓ) కృష్ణవేణి తెలిపారు. మొదటి వారంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినప్పటికీ వాటన్నింటినీ పరిష్కరించి ప్రజలకు త్వరితగతిన రేషన్‌ను అందజేస్తున్నామని తెలిపారు. రేషన్ సరుకులలో బియ్యంతో పాటు 7 కిలోల గోధుమలు, 1 కిలో చక్కెర కూడా లభిస్తాయని, ఇటీవల రేషన్ కార్డు పొందిన వారు కూడా రేషన్ పొందవచ్చని ఆమె వివరించారు. సర్కిల్ 8 పరిధిలో 69,908 కార్డులు ఉండగా 67 మంది రేషన్ డీలర్లు ఉన్నారని ఆమె తెలిపారు.



పతకాలతో హరికృష్ణనాయక్

హరికృష్ణనాయక్‌కు యోగాలో రెండు పతకాలు

అడ్డగుట్ట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ కంచరపార పట్టణలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి యోగాసాన పోటీల్లో అడ్డగుట్ట హిల్ టాప్‌కాలనీకి చెందిన పి.హరికృష్ణనాయక్ రజిత, కాంస్య పతకాలను సాధించాడు. రిధ్మిక్ యోగాలో రజిత పతకం, ట్రెడిషనల్ యోగాసనంలో కాంస్య పతకాన్ని అందుకున్నారు. తన తల్లిండ్రుల ప్రోత్సాహం, గురువు సాయిబాబా అందించిన శిక్షణ వల్లే ఈ పతకాలు సాధించానని హరికృష్ణనాయక్ పేర్కొన్నారు.